భృతి ఏది బాబూ..?

- నిరుద్యోగ భృతి కోసం యువత ఎదురు చూపులు
- ఆ ఊసే ఎత్తని రాష్ట్ర ప్రభుత్వం
- ఎన్నికల మేనిఫెస్టో అమలుపై సన్నగిల్లుతున్న నమ్మకాలు
- ఉద్యోగాలకు నోటిఫికేషన్లు లేక, నిరుద్యోగ భృతి ఇవ్వక అవస్థ పడుతున్న నిరుద్యోగులు



చీమకుర్తి: ఒకవైపు ఉద్యోగాలకు నోటిఫికేషన్లు లేవు. బీఈడీ, లేక టీటీసీ ఉన్న వారికి తప్ప మిగిలిన వారికి డీఎస్సీ నోటిఫికేషన్ ఉపయోగపడదు. ఒకటీఅరా కేంద్ర ప్రభుత్వానికి చెందిన, బ్యాంకింగ్ రంగానికి చెందిన నోటిఫికేషన్లకు ప్రిపేర్ అవుదామంటే సరైన ఆర్థిక స్థోమత లేక తల్లిదండ్రులపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఇలాంటి కష్టకాలంలో ఎన్నికల మేనిఫెస్టోలో కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి అందిస్తే.. కాస్తయినా ఉపశమనం లభిస్తుందేమోనని ఎంతోమంది నిరుద్యోగులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండో నెల వచ్చినా నిరుద్యోగ భృతి ఊసే ఎత్తకపోవడంతో నిరుద్యోగ యువతలో నైరాశ్యం నెలకొంది. ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్, ఇతర గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్లు పూర్తి చేసి విజయవాడ, హైదరాబాద్, ఇతర ప్రాంతాల్లో కోచింగ్ సెంటర్ల చుట్టూ తిరిగి తల్లిదండ్రులు ఇచ్చిన కొద్దిపాటి కాసులు కాజేసుకోవడమే జరుగుతుంది తప్ప నోటిఫికేషన్‌లు లేక ఉద్యోగాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని యువత వాపోతున్నారు.

సంతనూతలపాడు నియోజకవర్గంలో వేల మంది నిరుద్యోగులు...

సంవత్సరాల తరబడి తల్లిదండ్రుల రెక్కల కష్టం మీద వచ్చిన డబ్బుతో కోచింగ్ సెంటర్లలో పెట్టుబడులు పెట్టలేక ప్రైవేటు ఉద్యోగాలైనా దొరుకుతాయేమోనని ఆశగా ఎదురుచూస్తే.. అక్కడా చాలీచాలని జీతాలతో ఎలా బతకాలో తెలియడం లేదు. దీంతో ప్రభుత్వం చెప్పిన నిరుద్యోగ భృతితోనైనా ఉద్యోగాలకు ప్రిపేర్ కావచ్చని నిరుద్యోగ యువత ఎదురు చూస్తోంది. అధికారంలోకి వస్తే నిరుద్యోగ భృతి ద్వారా నెలకు రూ.3 వేల ఆర్థిక సాయం అందిస్తామని కూటమి ప్రభుత్వం చెప్పడం, అదే ప్రభుత్వం అధికారంలోకి రావడంతో భృతి ఎప్పటి నుంచి ఇస్తారంటూ నిరుద్యోగ యువత ఎదురు చూస్తున్నారు. ఇంటర్, డిగ్రీ, పీజీలు పూర్తి చేసుకున్న నిరుద్యోగ యువత సంతనూతలపాడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో దాదాపు 60 వేల నుంచి 70 వేల మంది వరకు ఉండొచ్చని అంచనా. వారిలో ప్రభుత్వ నిబంధనల మేరకు నిరుద్యోగ భృతికి అర్హత కలిగిన వారు సుమారు 50 వేల మంది ఉండొచ్చని అంచనా. వారంతా నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూస్తుండటంతో వారి తల్లిదండ్రులు కూడా ప్రభుత్వం త్వరగా అందిస్తే తమ పిల్లలకు కాస్త ఊరట కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఒంగోలు నియోజకవర్గంలో లక్ష మంది ఎదురుచూపులు...

ఒంగోలు: తాము అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు భృతి ఇస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించడంతో నిరుద్యోగులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడి నెలదాటినా ఇంకా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ఒంగోలు నియోజకవర్గ ప్రజలు పెదవివిరుస్తున్నారు. అసలు ఎప్పటి నుంచి ఇస్తారనే విషయం ఇప్పటివరకు ప్రకటించకపోవడంతో నిరుద్యోగుల్లో ఆందోళన ప్రారంభమవుతోంది. ఒంగోలు నియోజకవర్గంలో లక్ష కుటుంబాలకుపైగా ఉంటారు. వారిలో ఇంటికి ఒకరు చొప్పున లక్ష మంది నిరుద్యోగులు ఉంటారని అంచనా. వారిలో నిరుద్యోగ భృతికి అర్హులు 60 వేల మంది వరకు ఉంటారు. వీరంతా సరైన ఉద్యోగాలు లేక ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికల హామీలో చెప్పడంతో ఆశగా కూటమి పార్టీలకు ఓట్లేసి గెలిపించారు. అదే ఆశతో నిరుద్యోగ భృతి కోసం ఎదురుచూస్తున్నారు. భృతి కింద నెలకు రూ.3 వేల చొప్పున అందిస్తే ఎంతోకొంత ఆసరాగా ఉంటుందని అంటున్నారు.

గత సంవత్సరం డిగ్రీ పూర్తి చేసి ఖాళీగా ఉన్నా

గతేడాది నా డిగ్రీ పూర్తయింది. అప్పటి నుంచి ఉద్యోగం కోసం ఎదురుచూస్తూ ఖాళీగా ఉన్నా. ఈలోపు ఎన్నికలు రావడం, నిరుద్యోగులకు 3 వేల రూపాయల భృతి కల్పిస్తామంటూ కూటమి పార్టీలు ఎన్నికల సమయంలో హామీ ఇవ్వడంతో వారికే ఓటు వేశా. ఎన్నికల హామీలు నెరవేరుస్తారని నమ్మాను. కానీ, నెల దాటినా నిరుద్యోగ భృతి హామీ నెరవేర్చేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. నిరుద్యోగ భృతిపై తక్షణమే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన చేయాలి.

వసంత్, నిరుద్యోగి, మద్దిపాడు

ఇచ్చిన మాట ప్రకారం నిరుద్యోగ భృతి ఇవ్వాలి



ఇంటికో ఉద్యోగం లేదా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ నిరుద్యోగ భృతి కల్పిస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఆ మేరకు త్వరగా ఉద్యోగాల కల్పన చేపట్టాలి. లేకుంటే వెంటనే నిరుద్యోగ భృతి అందించాలి.

పఠాన్ ఇమ్రాన్, అమ్మనబ్రోలు, నాగులుప్పలపాడు మండలం

అర్హులందరికీ వర్తింపజేయాలి



నిరుద్యోగ భృతిని అర్హులందరికీ అమలు చేయాలి. రాష్ట్రంలో ఉద్యోగ ఖాళీలపై శ్వేతపత్రాన్ని విడుదల చేయాలి. 2014లో గెలిచినప్పుడు నిరుద్యోగ భృతి ఇవ్వకుండా కాలయాపన చేసినట్లు ఇప్పుడు కూడా చేయకుండా సీఎం చంద్రబాబు వెంటనే నిరుద్యోగ భృతి ఇవ్వాలి.

– సీహెచ్ వినోద్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి, ఒంగోలు

నిరుద్యోగ భృతిపై దోబూచులాట తగదు



ఎన్నికల సందర్భంగా ప్రధాన హామీగా ఇచ్చిన నిరుద్యోగ భృతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటి వరకు మాట్లాడకపోవడం సమంజసం కాదు. దానిపై కనీసం అధికారులతో చర్చించినట్లు కూడా లేదు. విధివిధానాలు రూపొందించే ప్రయత్నాలు జరగడం లేదు. ఈ పరిస్థితి చూస్తే నిరుద్యోగ భృతి ఇప్పట్లో ఇచ్చే పరిస్థితి కానరావడం లేదు. ఎప్పటి నుంచి అమలు చేస్తారనే విషయం చంద్రబాబు స్పష్టంగా ప్రకటించాలి. రాష్ట్రంలో లక్షల నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు. అలాగే ఇంటికొక ఉద్యోగం ఇస్తానన్న హామీ కూడా నిలబెట్టుకోవాలి.

– ఎల్.రాజశేఖర్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు



ఒంగోలు వచ్చిన బాలినేనికి రైల్వేస్టేషన్‌లో భారీ సంఖ్యలో హాజరై స్వాగతం పలుకుతున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

కార్పొరేటర్లతో సమీక్షించిన బాలినేని



మేయర్, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లతో సమీక్షిస్తున్న మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: నగరపాలక సంస్థ మేయర్, డిప్యూటీ మేయర్లు, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లతో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సోమవారం సాయంత్రం స్థానిక తన నివాసంలో ముఖాముఖి నిర్వహించారు. నగరపాలక సంస్థ ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. అందరూ సమన్వయంతో పనిచేసి అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని చెప్పారు. తప్పుడు ప్రచారాలకు అవకాశం ఇవ్వవద్దంటూ దిశానిర్దేశం చేశారు. అందరికీ తాను అండగా ఉంటానని బాలినేని భరోసా ఇచ్చారు.

పెద్దిరెడ్డి భాస్కరరెడ్డికి పరామర్శ...

ఒంగోలు 33వ డివిజన్ కార్పొరేటర్ పెద్దిరెడ్డి నియంతకుమారి భర్త పెద్దిరెడ్డి భాస్కరరెడ్డిని ఆయన నివాసంలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆయన సతీమణి శచీదేవి సోమవారం పరామర్శించారు. అనారోగ్య సమస్యల కారణంగా చికిత్స తీసుకుంటూ ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండగా ఆరోగ్యం గురించి బాలినేని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్తగా ఉండాలని పెద్దిరెడ్డి దంపతులకు సూచించారు. బాలినేని వెంట వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు జేమ్స్, నాయకులు నాగూర్‌వలి, గొర్రెపాటి శ్రీనివాసరావు, బొట్ల సుబ్బారావు, కార్పొరేటర్లు నాగం వెంకట శేషయ్య, వెన్నపూస వెంకటేశ్వర రెడ్డి, రమేష్‌రెడ్డి, బొమ్మినేని మురళి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, సోమశేఖర్, సీహెచ్ కృష్ణ, కుట్టుబోయిన కోటియాదవ్, కరుణాకర్, స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దిరెడ్డి భాస్కరరెడ్డిని పరామర్శిస్తున్న బాలినేని దంపతులు

నేడు కెరీర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం

ఒంగోలు: కెరీర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం నిర్వహిస్తున్న 20 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మంగళవారం స్థానిక సమగ్రశిక్ష కార్యాలయంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు అవగాహన కార్యక్రమం ఉంటుందని, 20 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

అవార్డుల కోసం ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలు: జాతీయ స్థాయిలో ఈ ఏడాది ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానం కోసం పది సంవత్సరాల సర్వీసు పూర్తిచేసి అర్హత, ఆసక్తి గల ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర సూచించారు. ఈ దరఖాస్తులను హెచ్‌టీటీపీ://నేషనల్‌అవార్డ్స్‌టుటీచర్స్.ఎడ్యుకేషన్.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా పంపుకునేందుకు గడువును ఈ నెల 18వ తేదీ వరకు పొడిగించారన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు కాపీ, రెండు సెట్ల ప్రతిపాదనలు వర్డ్ డాక్యుమెంట్ సీడీని 30 పేజీలకు మించకుండా జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయానికి ఈ నెల 18వ తేదీలోగా పంపాలని ఎంఈవో, ఉప విద్యాశాఖ అధికారులకు తెలిపారు.

క్లుప్తంగా

పీడీ అర్జునరావు వేధింపులు భరించలేమంటూ నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధి హామీ సిబ్బంది

ఒంగోలు సిటీ: జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టరు అర్జునరావు తీరుపై ఉపాధి హామీ సిబ్బంది రోడ్డెక్కారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసిన అనంతరం కలెక్టర్‌కు లేఖ విడుదల చేశారు. 18 ఏళ్లుగా ఎంతో కష్టపడి జాతీయ గ్రామీణ ఉపాధి సంస్థలో తాము పనిచేస్తున్నామని, కానీ, ప్రస్తుత పీడీ అర్జునరావు తమను వేధింపులకు గురిచేస్తున్నాడని వారు వాపోయారు. కించపరచడం, అవహేళన చేయడం చేస్తున్నాడని తెలిపారు. ప్రతి క్లస్టర్ పరిధిలో ప్రగతి పేరిట సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేసి ప్రతి మండలం నుంచి నెలకు లక్ష రూపాయల మామూళ్లు ఇవ్వాలని హెచ్చరిస్తున్నారని తెలిపారు. డబ్బులివ్వని పక్షంలో వారిని టార్గెట్ చేసి సమావేశాల్లో, టెలీ కాన్ఫరెన్స్‌లో సస్పెండ్ చేస్తానని, ఉద్యోగం నుంచి తొలగిస్తానని భయభ్రాంతులకు గురిచేసి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పీడీ అర్జున్‌రావు బారి నుంచి తమను రక్షించాలని కోరుతూ కలెక్టరుకు విన్నవించుకున్నారు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలి

- కలెక్టరు ఏ.తమీమ్ అన్సారియా



అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించే అర్జీలకు అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీకోసం సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ అర్జీలను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువు లోపల పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆన్‌లైన్‌లో వచ్చే అర్జీలను సంబంధిత శాఖల హెచ్.ఓ.డిలు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అర్జీదారులకు నిర్ణీత గడువు లోపల పరిష్కరించాలన్నారు. అనంతరం హెల్మెట్ వినియోగం పై ప్రజల్లో అవగాహన కల్పించడంలో భాగంగా రవాణాశాఖ రూపొందించిన గోడప్రతులు, బ్యానర్లను కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, డీటీసీ సుశీలతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, డీఆర్వో విశ్వేశ్వరరావు, ఎస్.డి.సి.లు వరకుమార్, ఝాన్సీలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సర్పంచ్‌ని వేధించిన వారిపై

చర్యలు తీసుకోవాలి



ధర్నా చేస్తున్న ఎస్టీ సంఘ నాయకులు

నాగులుప్పలపాడు: మండలంలోని ఉప్పుగుండూరు గ్రామ సర్పంచ్ దేవరకొండ జయమ్మ పట్ల పంచాయతీ కార్యదర్శి హరిబాబు వ్యవహరిస్తున్న తీరు దుర్మార్గమని, పంచాయతీ కార్యదర్శిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎరుకుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ కుమార్ ధర్మా డిమాండ్ చేశారు. సోమవారం పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామ సర్పంచ్ దేవరకొండ జయమ్మ, గ్రామస్తులతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్ కుమార్‌ధర్మా మాట్లాడుతూ ఎరుకుల కులానికి సంబంధించిన వ్యక్తి గ్రామ సర్పంచ్‌గా ఉండటాన్ని ఓర్చుకోలేని పంచాయతీ కార్యదర్శి నిరంతరం సర్పంచ్‌ను చులకనగా మాట్లాడటం, కులం పేరుతో దూషించడం దుర్మార్గమైన చర్యని అన్నారు. ఇప్పటికే గ్రామంలో సర్పంచ్ చేసిన అభివృద్ధి కార్యక్రమాలకు బిల్లులు చెల్లించకుండా అగ్రకులాలకు చెందిన కనగాల శ్రీను, జాలాది సురేంద్ర మాటలు వింటూ సర్పంచ్ దేవకరొండ జయమ్మపై కుల అహంభావం చూపడం దుర్మార్గమన్నారు. ఇప్పటికే గ్రామ పంచాయతీ కార్యదర్శిపై సర్పంచ్ పెట్టిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నీరుగార్చడానికి చర్యలు తీసుకోకుండా జాప్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. అనంతరం పంచాయతీ సిబ్బందికి ఫిర్యాదు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎరుకుల హక్కుల పోరాట సమితి లీగల్ అడ్వైజర్ ప్రతాప్, నాగయ్య, పాలపర్తి యానాదిరావు, వెంకటేశ్వర్లు, రాంబాబు, కుంభా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యలపై ప్రత్యేక దృష్టి

- ఫిషింగ్ హార్బర్ స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా
- మత్స్యకారులతో ముఖాముఖి



కె.పల్లెపాలెంలో మత్స్యకారులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

కొత్తపట్నం: జిల్లాలోని మత్స్యకారుల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని కలెక్టర్ తమీమ్ అన్సారియా హామీ ఇచ్చారు. కొత్తపట్నం మండలంలో సోమవారం ఆమె పర్యటించారు. కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి కొత్తపట్నం వచ్చిన కలెక్టర్.. కె.పల్లెపాలెం, పిన్నివారిపాలెం గ్రామాలను సందర్శించారు. ముందుగా కొత్తపట్నం కె.పల్లెపాలెంలో ఉన్న మత్స్యకారుతో ముఖామఖి నిర్వహించారు. చేపల వ్యాపారానికి వెళితే ఎంత ఆదాయం వస్తుంది.. వినియోగదారులు చేపలు ఎంతకు కొనుగోలు చేస్తారు, విక్రయాలకు ఏఏ ప్రాంతాలకు వెళతారని వివరాలడిగి తెలుసుకున్నారు. చిరువ్యాపారస్తులు మాట్లాడుతూ రూ.1000 చేపలు కొనుగోలు చేసుకుని వెళితే.. అసలుపోను రూ.200 నుంచి రూ.300 మిగులుతుందని తెలిపారు. చేపల చిరు వ్యాపారస్తులకు సబ్సిడీ లోన్లు ఇవ్వాలని కోరారు. ఫిషరీష్ జేడీ ఆవుల చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తీర ప్రాంతంలో చిన్న, సన్నకారు మత్స్యకార కుటుంబాలు ఉన్నాయని, అందరూ సముద్రంలో మత్స్య సంపదపై ఆధారపడి జీవిస్తారని కలెక్టర్‌కు తెలిపారు. వారు డ్వాక్రా గ్రూపు సభ్యులుగా కూడా ఉన్నారని చెప్పారు. ఫిషింగ్ హార్బర్ మొదటిగా కె.పల్లెపాలెం ఉత్తరం వైపు నిర్మించాలని సిద్ధం చేశామని, 86 గృహాలు అడ్డువస్తున్నాయని, అందువలన పిన్నివారిపాలెం వైపునకు మార్చడం జరిగిందని కలెక్టర్‌కు వివరించారు. మూడు జిల్లాల మత్స్యకార కార్మిక సంఘ అధ్యక్షుడు గొల్లపోతు నాగార్జున మాట్లాడుతూ చెన్నై నుంచి సోనాబోట్లు రావటం వలన తాము మత్స్య సంపద కోల్పోతున్నామని, చెన్నై వారు రాకుండా చూడాలని కలెక్టర్‌ను కోరారు. అనంతరం సోషల్ ఫారెస్ట్ స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. దానికి సంబంధించిన వివరాలను తహసీల్దార్ హేమంత్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. బీచ్ దగ్గర శిథిలావస్థలో ఉన్న వసతి గృహాలు, చిల్డ్రన్స్ పార్క్‌ను పరిశీలించారు. మహిళలు దుస్తులు మార్చుకోవడానికి, భోజనం చేయటానికి, కొద్దిసేపు సేదతీరడానికి ఎటువంటి వసతులు లేవని గ్రామ కాపులు కలెక్టర్ దృష్టికి తీసికెళ్లారు. అనంతరం పిన్నివారిపాలెం వెళ్లి ఫిషింగ్ హార్బర్‌కు కేటాయించిన సర్వే నంబర్ 586/25లోని 17.54 ఎకరాల స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. స్థలం మొత్తం ఖాళీగా ఉందా.. ఎవరైనా ఆక్రమించుకున్నారా అని ఆర్డీవో జీవీ సుబ్బారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. రికార్డులన్నీ సిద్ధం చేసి ఉంచాలని, ఎప్పుడు అడిగితే అప్పుడు ఇవ్వాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం మోటుమాలలో కస్తూర్బా గాంధీ వనరుల కేంద్రాన్ని ఆకస్మికంగా కలెక్టర్ తనిఖీ చేసి విద్యార్థినులతో మాట్లాడారు. భోజనం, కూరలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఆహారం రుచి చూశారు. విద్యార్థులను వివరాలడిగి తెలుసుకున్నారు. అన్ని బాగా ఉండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఫణికుమార్ నాయక్, ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య, ఏఎస్‌వో కోటేశ్వరరావు, ఏడీ ఉషాకిరణ్, సర్పంచ్ విశ్వనాథపల్లి ఆనందరావు, రవికుమార్, పల్లెపాలెం ఎంపీటీసీ సభ్యుడు పిన్ని నరసింహారావు, ఫిషరీష్ అసిసెంట్లు, సాగర్ మిత్రలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చీమకుర్తి సీఐగా సుబ్బారావు



చీమకుర్తి: చీమకుర్తి సీఐగా ఎం.సుబ్బారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు సీసీఎస్ నుంచి బదిలీపై వచ్చారు. గతంలో చీమకుర్తి సీఐగా పనిచేసిన దుర్గాప్రసాద్ సస్పెండ్ కావడంతో నెలరోజులుగా ఖాళీగా ఉన్న పోస్టుకి సుబ్బారావును నియమించారు. నూతన సీఐకి పోలీసు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.